విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 21 సెప్టెంబరు 2025 | 8 పేజీలు

స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్టుకు ప్రతిష్టాత్మక స్కాచ్ గోల్డెన్ అవార్డు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: చంద్రగిరి మండలంలో అమలవుతున్న స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్ట్ దేశస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ప్రాజెక్ట్ ప్రారంభం కాగానే కేవలం ఒకే ఏడాదిలో 1,600 గృహాలపై సౌర ఫలకాలను అమర్చి, పచ్చ శక్తి వినియోగాన్ని విస్తృతం చేసినందుకు ఈ ప్రాజెక్ట్‌కి స్కాచ్ గోల్డెన్ అవార్డు లభించింది. శనివారం నాడు న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడుతో కలిసి ఈ అవార్డును స్వీకరించారు. ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏ.రంగంపేట, కందులవారిపల్లి,

2లో

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే

కఠిన చర్యలు

దసరా సెలవులు ప్రకటించిన విద్యాశాఖ

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు దసరా సెలవులను సెప్టెంబర్ 22వ తారీఖు నుండి అక్టోబర్ 2వ తారీఖు వరకు (మొత్తం 11 రోజులు) ప్రకటించారు. ఈ మేరకు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.యన్. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర యాజమాన్య పాఠశాలలు ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి సెలవులు ఇవ్వాలని, ఈ సమయంలో ఎట్టి పరిస్థితుల లోనూ తరగ తులు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు. సెలవులకు విరుద్ధంగా పాఠశాలలు కొనసాగించే యత్నం చేస్తే, సంబంధిత యాజమాన్యంపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణాత్మక కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి ఆ ప్రకటనలో హెచ్చరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- భావితరాల వారికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దాం
- గిరిజన పిల్లలు విద్యావంతులు కావాలి
- గిరిజనులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - గుడిపాల : విద్య ద్వారా మెరుగైన జీవన విధానం పొందవచ్చని, ప్రతి గిరిజన కుటుంబంలోని పిల్లలందరినీ బడికి పంపించి చదివించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.శనివారం గుడిపాల పంచాయతీ పరిధిలోని అనుపు ఎస్టీ కాలనీ నందు జిల్లా కలెక్టర్ స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం, భావితరాల వారికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దాం అని తెలిపారు. అనంతరం మండల స్థాయి అధికారులతో కలసి ఎస్టి కాలనీలోని గుడి సమీపంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల వారి స్థితి గతులు మార్పు చెందాలంటే వారి పిల్లలను ఖచ్చితంగా బడికి పంపి చదివించాలన్నారు. విద్య ద్వారా ఉపాధి పొంది తమను తాము పోషించుకోగల స్థితి వస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలన్నారు. కాలనీ వాసులు తమకు పక్కా ఇల్లు లేవని, ఉన్న గృహాలు వర్షం వస్తే నీరు కారుతుందని తమకు పక్కా గృహాలు కావాలని కోరగా

2లో

అడవి బిడ్డల కష్టానికి..

ఫలితం దొరికేనా

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల పరిసరాలలో అడవికి సంబంధించిన వేల ఎకరాల భూమిలో ఆటవీ సంపద పుష్కలంగా లభిస్తుంది. ఆయుర్వేద మూలికల నుండి వివిధ రకాల చెట్లు ఈ అడవిలో దర్శనమిస్తుంటాయి. కొలమాసన పల్లికి చెందిన రత్నమ్మ ఆయుర్వేద నర్సరీని స్థాపించి మూలికలను సేకరించి రాష్ట్రస్థాయిలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే 2002 సంవత్సరంలో ధర్మపురి ప్రాంతానికి చెందినటువంటి 15 మంది బడుగు బలహీన వర్గాల ప్రజల చేత ఒకటిన్నర సంవత్సరం కష్టించి నాటినటువంటి వివిధ రకాల చెట్లు ఇప్పుడు ఫలాలను అందిస్తున్నాయి. 35 ఎకరాల అడవికి సంబంధించిన భూమిని ఇంగడిన్ని సీతాఫలం,చింత,నేరేడు, ఉసిరి, వెదురు, ఎర్రచందనం వంటి చెట్లను తిరుపతి కుక్కలదొడ్డి నుండి తెచ్చి వాచర్ సుబ్బయ్య సమక్షంలో అప్పటి ఎఫ్ ఆర్ ఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తిని తినకుండా కష్టించి నాటడం జరిగింది. కష్టపడినటువంటి వారు ఒక గ్రూపుగా ఏర్పడి ఈ ఫలసాయాన్ని పొందవచ్చునని అప్పటి అధికారులు వీరితో చెప్పారు. ఈ చెట్ల పెంపకం గురించి ధర్మపురికి చెందిన రామమూర్తి అనే వ్యక్తిని మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ కాన్హా నేషనల్ పార్కునకు ట్రైనింగ్ నిమిత్తం

2లో

తిరుమల పవిత్రత, ప్రశాంతత కాపాడటం..

మనందరి బాధ్యత

- టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: తిరుమల పవిత్రత, ప్రశాంతత కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా భక్తులకు సరైన సమాచారం అందించే విషయంలో మీడియా పాత్ర మరింత కీలకమైనదని టీటీడీ అదనపు ఈఓ శ్రీ సి. హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు.తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శనివారం టీటీడీ సీవీఎస్వో శ్రీ మురళీకృష్ణతో కలిసి మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధుల నుండి ప్రయోజనకరమైన సూచనలను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని పేర్కొన్నారు.ఇటీవల కాలంలో సోషల్ మీడియా వేగంగా పెరుగుతోందని, కానీ చాలామంది యూట్యూబర్లు భక్తులకు సరైన సమాచారం ఇవ్వకుండా, అవాస్తవ మైన ఆధారరహిత వార్తలతో గందరగోళానికి గురి చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి తప్పుడు వార్తలు ప్రపంచవ్యాప్తంగా ఉండే శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బ తినే అవకాశం ఉంటుందని తెలిపారు.తిరుమల కొండల పవిత్రతను కాపాడటం, టీటీడీ కార్యక్రమాలను ప్రోత్సాహించే విషయంలో మీడియాపై ఎంతో బాధ్యత ఉందని

2లో

స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్టుకు ప్రతిష్టాత్మక స్కాచ్ గోల్డెన్ అవార్డు

(మొదటి పేజీ తరువాయి) చిన్న రామాపురం గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.20.68 కోట్ల వ్యయంతో సౌరఫలకాలు ఉచితంగా అమర్చబడ్డాయి. ఇందులో కేంద్రం రూ.10.19 కోట్లు, రాష్ట్రం రూ.10.49 కోట్లు వెచ్చించాయి. 3396 కిలోవాట్ల సామర్థ్యం గల ఈ సౌరపరికరాలు ఏటా 4.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, రూ.3.79 కోట్ల ఆదా కలిగిస్తాయి. అలాగే, ఇది 1.92 లక్షల చెట్లు తగ్గించే కార్బన్ ఉద్గారాల సమాన ప్రభావం చూపనుంది. ఈ విజయంపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, స్పెషల్ ఆఫీసర్ డిపిఓ సుశీల దేవితో పాటు జిల్లా అధికారులు కలెక్టర్‌ను అభినందించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

(మొదటి పేజీ తరువాయి) రెండు వారాలలో చర్యలు చేపట్టాలని తహశీల్దార్ ను ఆదేశించారు. శ్మశానానికి వెళ్లాలంటే ప్రైవేట్ వ్యక్తుల భూమి గుండా వెళ్లాల్సి ఉండగా సమస్యగా ఉందని దారి సమస్య తీర్చాలని కోరగా తహశీల్దార్ స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి దారి సమస్య తీర్చడానికి త్వరలో మండల సర్వే బృందం కాలనీకి పంపడంజరుగుతుందని తెలిపారు. తమిళనాడు నుండి కొంత మంది వలస రావడం జరిగిందని, వారికి కనీసం ఆధార్ కార్డులు కూడా లేవని తెలుపగా వెంటనే ఆధార్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. పంచాయతీ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఆ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆడ పిల్లలు కంప్యూటరు విద్యకు సంబంధించి నైపుణ్య శిక్షణ పొందాలని అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానన్నారు. వీరికి అవకాశాన్ని బట్టి స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కాలనీలో దాదాపు 46 గృహాలు ఉన్నాయని ఓవర్ హెడ్ ట్యాంక్ మంజూరు చేయాలని కోరగా, ప్రస్తుతం ఒక సిన్టెక్స్ ట్యాంక్ ఉందని, ఇందుకు అదనంగా రెండు ట్యాంకు లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రం ప్రైవేట్ గదులలో ఉన్నదని, నూతనంగా ప్రభుత్వ అంగన్వాడీ భవనం నిర్మించాలని కోరగా, ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రంలో కేవలం 5 మంది పిల్లలు ఉన్నారని, ఇప్పుడు ఉన్న భవనాన్ని పునరుద్ధరించి ఇవ్వడం జరుగుతుందన్నారు. నూతనంగా వివాహం అయిన దంపతులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఒంటరి మహిళ, వితంతు పెన్షన్ మంజూరు చేయాలని స్థానికులు కలెక్టర్ ను కోరారు. కాలనీ వాసులు కోరిన అభ్యర్థనలను సావదానంగా విన్న కలెక్టర్ కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించి మరికొన్నింటిని పరిశీలించి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపాల మండల తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ కుమార్, డ్వామా ఏపిడి సుబ్రమణ్యం, ఎం ఈ ఓ హసన్ భాష, ఎస్సై రామ్మోహన్, వైద్య, విద్యుత్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫలితం దొరికేనా

(మొదటి పేజీ తరువాయి) 22 రోజులపాటు పంపించి,అక్కడ తర్ఫీదు చేయడం జరిగింది. అనంతరం ఈ చెట్లు నాటడంలో కష్టపడిన బడుగు బలహీన వర్గాల వారు ఇప్పుడు ఎటు వంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడు నాటిన చెట్లు ఇప్పుడు ఫలాలను అందిస్తున్నాయి. కష్టపడిన వారిని గుర్తించి ఆ ఫల సాయం వారికి అందే విధంగా చేయాలని వారు తెలియజేస్తున్నారు. ఆలనా పాలనా లేక అవి కాస్త అడవి కాచిన వెన్నెలలా తయారైయ్యింది. 23 సంవత్సరాలు సుదీర్ఘ కాలం గడిచినందుకు ఇక్కడ నాటిన చెట్ల గురించి అటవీ శాఖ సిబ్బందికి కూడా తెలియడం లేదని తెలుస్తుంది. పిచ్చిగుండ్లపల్లి, కమ్మనపల్లి,సాకే ఊరు, మరిమానుచేన్లు వంటి గ్రామాలకు ఆనుకొని ఉన్నటువంటి అడవిలో ఎర్రచందనం చెట్లను కూడా నాటడం జరిగినది .ఇప్పుడు అవి ఏపుగా పెరిగి ఉన్నవి వీటి ఆలనా పాలనా చూడనానికి అటవీ సిబ్బంది కనుచూపుమేరలో కనిపించడం లేదు. వెదురు పొదలు కూడా ఏపుగా మొలచినవి ఇప్పటికైనా సంబంధిత ఫారెస్ట్ అధికారులు 35 ఎకరాలలో చెట్లను నాటి కష్టపడిన వారి శ్రమకు ఫలితాన్ని అందించి ఈ అడవిలో ఉన్నటువంటి 100 ఎకరాల విలువైన చెట్లను కాపాడి,చెట్లను నాటిన వారిని గుర్తించి,పంటను అనుభవించే విధంగా చర్యలు తీసుకో వాలని కష్టపడి చెట్లు నాటిన పేదలకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మనందరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి) అభిప్రాయపడ్డారు. తిరుమలలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మీడియా ప్రతిని ధులకు తిరుమలలో జరుగుతున్న అభివృద్ధిపై, భక్తులకు టీటీడీ అందిస్తున్న విశేష సేవలపై ఎంతో అవగాహన ఉంటుందని తెలిపారు.టీటీడీపై అసత్య కథనాలతో దుష్ప్రచారం చేసే వారిని నియంత్రించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను ప్రజలకు చేరవేయాలని కోరారు.ఈ సమావేశంలో డీఎఫ్వో శ్రీ ఫణి కుమార్ నాయుడు, సీపిఆర్వో డాక్టర్ టి. రవి, వీజీవోలు శ్రీ రామ్ కుమార్, శ్రీ సురేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రీ పిహెచ్.డి పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో పిహెచ్.డి. డిగ్రీ కోసం పరిశోధన చేస్తున్న ఫుల్ టైమ్/పార్ట్ టైమ్ అభ్యర్థులు సంబంధిత అప్లికేషన్ పూర్తిచేసి, నిర్దేశిత ఫీజు చెల్లించాలని యస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 3715/- రూపాయలతో అక్టోబర్ 15 లోగా ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుముతో అక్టోబరు 26 వరకు గడువు ఉంటుందని, నవంబర్ నెలలో ప్రీ పిహెచ్.డి పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వారు సర్క్యులర్ జారీ చేశారు. మరిన్ని వివరాలకు యస్వీయూ పరీక్షల సర్టిఫికేట్ పోర్టల్లో చూడవచ్చని చెప్పారు.

శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి దేవీ నవరాత్రుల గోడపత్రిక ఆవిష్కరించిన ఎంఎల్ఏ నాని

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలోని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవి నవరాత్రుల గోడపత్రికను ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ఆవిష్కరించారు. మేళతాళాల నడుమ పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు, ఈవో, చైర్మన్, పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.గోడపత్రిక, కరపత్రాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ఆవిష్కరించారు. అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం నాచేతుల మీద జరగడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.అమ్మవారి దేవీ నవరాత్రులు వైభవంగా జరిగి, కీర్తి, ప్రతిష్టలు నలుమూలల వ్యాపించేలా కృషి చేస్తానన్నారు.ఉత్సవాల వైభవంలో దాతృత్వంతో సహకరించిన దాతలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరు, పార్టీలకు అతీతంగా కలసి పనిచేయాలని ఎంఎల్ఏ పిలుపునిచ్చారు.చంద్రగిరి పట్టణంలో వెలసిన సత్య ప్రమాణాలకు నెలవై, కొలిచిన వారికి కొంగు బంగారంగా వెలుగొందుతూ కోరిన కోర్కెలు తీర్చే తల్లి చంద్రగిరి పట్టణంలో కొలువుదీరి వున్న గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. అమ్మవారి పిలుపు కోసం ఎప్పుడూ ఎదురుచూస్తున్నానని, భక్తుల సేవకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నానని, ఎటువంటి అవసరం వచ్చిన కబురు పంపితే వెంటనే అక్కడికి వచ్చి సేవ చేసేందుకు సిద్ధమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆలయ అర్చకులు, ఈవో కె.మమత, నూతనంగా ఎన్నుకోబడిన ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఎం.గోపాల్ రెడ్డి, ఎం.గోపీనాథ్, ఆర్.వెంకటముని, యు.భారతి, డి.మునిరత్నమ్మ, కె.దుర్గ, పి.పాపమ్మ, జి.దేవి, ఎం యోగానందం, బి.వి స్వప్న, ఎక్స్ అఫీషియో మెంబర్ పి పద్మావతి లకు నాని శుభాకాంక్షలు తెలుపారు. కార్యక్రమానికి విచ్చేసిన అధికారులు, అనధికా రులు, కూటమి నాయకులు, భక్తులను పేరుపేరునా పలకరిస్తూ ముందుకు సాగారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపిం చారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చరణల నడుమ హారతులు ఇచ్చి ఆశీర్వచనాలతో ఆశీర్వదించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించిన ఆయన, అమ్మవారి కరుణతో ప్రజలకు శాంతి, ఐశ్వర్యం, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తూ భక్తుల సౌకర్యం కోసం మరింత శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు.శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి ఆలయం చంద్రగిరి నియోజకవర్గంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచి, ప్రత్యేకత కలిగిన ఆలయమని ఎల్లమ్మ తల్లి దేవీ నవరాత్రులు ఈనెల 24 వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సదుపాయం, శానిటేషన్, వైద్య సిబ్బంది, భద్రతా బందోబస్తు వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలను మరింత శోభాయమానంగా, సుందరంగా, వైభవంగా జరగడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి నవరాత్రి ఊరేగింపు వివరాలు: 24/09/2025: పెద్దశేష వాహనం25/09/ 2025: గజ వాహనం26/09/2025: నంది వాహనం27/09/ 2025: గరుడ వాహనం28/09/2025: హంస వాహనం29/09/ 2025: అశ్వ వాహనం30/09/2025: సింహ వాహనం01/10/ 2025: శ్రీ దుర్గా అలంకరణ (పూలతేరు)02/10/2025: మహిషాసుర మర్దిని (పుష్ప పల్లకి) ఈ తొమ్మిది రోజుల పాటు జరుగు ఉత్సవాల్లో ప్రతి రోజు భక్తులు విశేష పూజలు, హారతులు, పుష్పాలతో ఊరేగింపులో పాల్గొని భక్తులు అమ్మవారి ఆశీర్వాదాలను పొందగలరని ఆలయ కమిటీ కోరారు.

వెంకన్న సంపదను వదలని జగన్ గ్యాంగ్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: తిరుమల వెంకటేశ్వరస్వామి సంపదను సైతం జగన్ గ్యాంగ్‌వదలలేదని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. శనివారం టీడీపీ నాయకుల తోక లిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులు, నాటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మా రెడ్డి అండదండలతో తిరుమల పరకామణిలో దొంగలు పాగా వేసి కోట్ల సొత్తు కొల్లగొట్టారన్నారు. ఈ సొమ్మును రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి అందులోని వాటాలను తిరుపతిలోని భూమన నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు అందాయని నింది తులే చెబుతున్నారన్నారు. భక్తులు ఎంతో నమ్మకంతో ముడుపులను హుండీలో వేస్తే వందలకోట్లు దోచెకెళ్లితే నాటి టీటీడీ చైర్మన్, అతని మనుషులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగన్ గ్యాంగ్ శ్రీవారిని చేయని అపచారం లేదన్నారు. ఏడుకొండ జోలికి వెళితే ఎం జరుగుతోందో తెలిసి కూడా జగన్, భూమన గ్యాంగ్ ఏకంగా పరకామణినే దోచేశారని ఆరోపించారు. గుడి, గుడిలో హుండీని దోచేసిన పాపాల గత పాలకుడు జగన్ గ్యాంగ్ పాపం పండి, పరకామణి వీడియోలు ఈరోజు బయటపడ్డాయన్నారు. రేపు నిందితులే వైసీపీ పాపాల చిట్టా విప్పబోతున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ధార్మిక సంస్థ లలో, టిటిడి వంటి సంస్థలలో జరిగిన దోపిడీకి సంబంధించిన సంఘటనలపై ప్రత్యేకమైన జ్యుడీషియల్ కమిషన్ చేత విచారణ జరిపించి, వెంకన్న సంపదను దోచుకున్న దొంగలను కఠినంగా శిక్షించి, భక్తుల మనోభావాలను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి. దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్ళ పాలెం పిఏసియస్ చైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, మణి, సంజాకుల మురళీకృష్ణ, కృష్ణమూర్తి, మురళీ నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

9 మరియు 11వ తరగతిలో నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు 23 సెప్టెంబర్ చివరి తేదీ

విశాలాంధ్ర - తిరుపతి : 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి 9 మరియు 11వ తరగతులలో జవహర్ నవోదయ విద్యాలయాలలో ప్రవేశాల కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు చివరి తేదీ 23 సెప్టెంబర్ 2025 అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యకులు డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 7, 2026న జరగనుంది.9వ తరగతి లో ప్రవేశానికి 2025-26 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతు 01.05.2011 నుండి 31.07.2013 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు.11వ తరగతిలో ప్రవేశానికి 2025-26 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుతు 01.06.2009 నుండి 31.07.2011 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు అని తెలిపారు.పోటీ పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాల కొరకు 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను మరియు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రాన్ని సంప్రదించవలసిందిగా డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి గారు సూచించారు.

జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు అభినందనలు

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : బీహార్ రాష్ట్రం, రోహతక్‌లోని నారాయణ్ వరల్డ్ స్కూల్‌లో ఈనెల 13 నుండి 17 వరకు జరిగిన జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్స్ అండర్ -17 బాలుర కబడ్డీ పోటీల్లో పాల్గొని ఫైనల్స్ వరకు పోరాడిన జట్టును ఘనంగా అభినందించారు. ఈ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో దాదాపు 20 జట్లు పాల్గొనగా అందులో తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు లీగ్ దశ నుండి ఫైనల్ వరకు అద్భుత ప్రతిభ కనబరచి శ్రీ గురు హరికృష్ణన్ పబ్లిక్ స్కూల్ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 45 -52 పాయింట్స్‌తో వెనకబడి రన్నర్స్‌గా నిలిచి వెండి పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో కబడ్డీ కోచ్‌లైన్ శంకర్, నరేష్‌లతో పాటు క్రీడాకారులను విద్యాసంస్థల%వా% చైర్మన్ డాక్టర్. బి.శేషారెడ్డి, డైరెక్టర్ బి. శ్రీకర్‌రెడ్డి, డీన్ సి.జి.హెచ్. ఖాన్, ప్రిన్సిపల్ డాక్టర్. పి.ఆర్.యస్. చక్రవర్తి, వైస్ ప్రిన్సిపల్ యస్. నాగార్జునలు ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దారుణం

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్

విశాలాంధ్ర - గూడూరు : పబ్లిక్, ప్రయివేట్ పార్ట్నర్షిప్ పద్దతిలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ దారుణమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరులోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్ మాట్లాడు తూ రాష్ట్రంలో విద్య ప్రయివేట్ పరం చేసేశారని, వైద్యం కూడా ప్రయివేటికరించేదుకు పూనుకుంటే ఊరుకోబోమన్నారు. గత పాలకులు రాష్ట్రంలో ఐదు వేల కోట్లు అప్పు తెచ్చి మరీ 17 వైద్య కళాశాలలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటే కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేటీకరించేందుకు పూనుకోవడం దారుణమన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకించి ప్రస్తుతం అధికా రంలోకి రాగానే వైద్య కళాశాలలు కూడా ప్రయివేటు పరం చేయడం సరికాదన్నారు. వెంటనే వైద్య కళాశాలల ప్రయివేటికరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బి. కె.ఎం.యు నియోజవర్గ కార్యదర్శి శ్రీనివాసా మూర్తి , ఏ. ఐ. వై.ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సి.వి.ఎల్ , ఏ . ఐ. వై.ఎఫ్ జిల్లా నాయకులు సునీల్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు మీరా , ఇన్సాఫ్ నాయకులు జమాల్, ఇలియాజ్ , తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: వీఆర్ఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళ నలో భాగంగా శనివారం ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ గ్రామరెవెన్యూ సహాయకుల సంఘం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ వీఆర్ఎల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని గతంలో కూడా పెద్దఎత్తున ఆందోళన నిసన కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేశారు. పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారే తప్పా అమలు చేయలేదని తెలిపారు. 22న కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు. వీఆర్ఎలకు పే స్కేల్ అమలు కావడంలేదని... వారి నామినీలనుకూడానియమించటం లేదనిచెప్పారు. అర్హులకు పదోన్నతులు కల్పించి కారుణ్య నియామకాలుచేపట్టాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ తో కూడిన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ చేతుల మీదుగా గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు,వీఆర్ఏలు తదితరులుపాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పిట్టవారవీధికి చెందిన ఓ మహిళ గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. ఈ విషయాన్ని యాంటీ కరెప్షన్ జిల్లా అధ్యక్షుడు లాలు ఎక్ట్ యాంటీ కరప్షన్ ఆల్ ఇండియా చీఫ్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రహమాన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం అనారోగ్యంతో బాధపడుతున్న ఆ మహిళను లాలు పరామర్శించారు. ధైర్యం చెప్పి అవసరమైన మం దులు, పండ్లు అందజేవారు. వారికి ఆ మహిళ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌బాషా, యాసిన్, మీర్జాసాహెబ్,అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు పూర్వ విద్యార్థుల సన్మానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం, లతను శనివారం బాలుర ఉన్నర పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని బాలుర ఉన్నత పాశాలలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ... తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులు సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో మరింత బాధ్యతతో విద్యార్థుల సమగ్రాభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో .ఎన్ డీ శివ, విజయ్ కుమార్, ప్రదీప్, హరీష్, నాగ శేషు, రాజశేఖర్, బాల, ప్రసాద్ స్వామి, మధు, యాసిన్, శ్రీవత్సవ్ శ్రీధర్ . వెంకటకృష్ణ ,జనార్ధన్ తదితరులు.పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం , శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తులు బేబీ రాణి మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ ఉపాధి హామీ పథకాలు, మహిళ భద్రత, ఉచిత న్యాయ సేవ చట్టం, వరకట్న నిరోధక చట్టం మరియు బాల్య వివాహాల నిర్మూలన చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ఇంట్లో పిల్లలకు మంచి ఇచ్చాడు మనమే నేర్పించాలని తెలిపారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలకు సంబంధించి కొన్ని కేసులు ఎదురు పడుతున్నాయని, వాటిలో ముఖ్యంగా డబ్బులు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మీకుఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే మీకు ఉచితంగానే సేవ అందిస్తారని అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్ 15100 ఉందని, తెలిపారు. కార్యక్రమం అనంతరం శ్రీకాళహస్తి సబ్ జైలును పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, మున్సిపల్ కమిషనర్, రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి, న్యాయవాదు లు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - పెనుమూరు: మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ కృష్ణ యానాధ కాలనీ ఓటమి ప్రభుత్వం ఏర్పడినటువంటి కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ నిన్నటి వరకు యానాది కాలనీ అభివృద్ధి చేయడానికి వారికి కావలసినటువంటి మౌలిక వసతులను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారని ఎంపీడీవో నీలకంతేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కృష్ణ యానాది కాలిన సందర్శించి వారికి కావలసి నటువంటి రేషన్ కార్డు. బర్త్ సర్టిఫికేట్. కాలనీ వాటర్ ట్యాంకు. యూదులను శుభ్రం చేయించి గ్రామంలో మహిళలందరినీ సమావేశపరిచి వారికి కావలసినటువంటి కనీస వసతులు ఏమేమి కావాలను ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి అవగాహన స్మశాన వాటిక కొన్ని ఇబ్బందులు ఉండట ంతో వాటిని పరిష్కరించడానికి తాసిల్దారు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రంలో గిరిజనులను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయముతో ఉన్నదన్నారు. గిరిజనులు వారి గ్రామములో ఉన్నటువంటి వీధులను శుభ్రం చేసుకొని ఇండ్లను శుభ్రం చేసుకుని పరిశుభ్రంగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేష్ నాయుడు. తలారి నాగరాజా. పంచాయతీ కార్యదర్శులు ఏపీవో గుణశేఖర్. ఏపిఎం చిరంజీవి తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌కు ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనో హర్‌ను శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్‌గా నియమితులైన కొట్టే సాయి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను కలంకారీ శేషవస్త్రంతో సత్క రించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. తనకు ట్రస్టుబోర్డు చైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛతే సేవ సాధనకు కృషి చేద్దాం

విశాలాంధ్ర - పుంగనూరు: స్వచ్ఛతే సేవ సాధనకు కృషి చేద్దామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి పిలుపునివ్వడం జరిగింది ఆయన శనివారం రోజున టిడిపి పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు సివిరెడ్డి సయ్యద్ సుహేల్ భాష సీఐ సుబ్బరాయుడు తో కలిసి పరిశుద్ధ కార్మికులతో మున్సిపల్ కార్యాలయం నుండి గోకుల్ సర్కిల్ వరకు స్వచ్ఛతే సేవ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో ప్లాస్టిక్ ను నిషేధించాలని నినాదాలు చేయడం జరిగింది ఈ సందర్భంగా సివిరెడ్డి సయ్యద్ సుహేల్ భాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత సేవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాక్షాత్తు రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఈ స్వచ్ఛత సేవ కార్యక్ర మంలో పాల్గొంటూ స్వచ్ఛతే సేవ మన రాష్ట్రం సాధించాలని కోరడం జరిగింద న్నారు. అందు కని మన పుంగనూరులో కూడా ప్రజలంతా స్వచ్ఛందంగా స్వచ్ఛతే సేవకు సహక రించి స్వచ్ఛత పుంగనూరు సాధనకు సహాయపడాలని కోరడం జరిగింది. ముఖ్యం గా వ్యాపారస్తులందరూ ప్లాస్టిక్ కవర్లను నిషేధించి బ్యాగులను వాడకం ప్రజలకు అలవాటు చేయాలని కోరుతున్నామన్నారు అంతే కాకుండా పట్టణ పరిధిలో ఉన్న ప్రజలంతా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. మన పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా బాగుంటుం దని తెలియజేశారు అనంతరం బ్యాగులను ప్రజలకు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: మట్టం శ్రావణి రెడ్డి

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామం లోనీ సినిమహల్ వీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ ,మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా,సంతోషం గా ఉంటుందన్నారు. మన సమాజం కూడా బాగుంటుందనే ఉద్దేశ్యంతో మన ప్రధాని నరేంద్ర మోదీ,ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.అదేవిధంగా మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.అనంతరం పోషకాహార వారోత్స వాలులో భాగంగా అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్ లను పరిశీలించి, వైద్యులు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి,అనంతరం వారికి మందులు పంపిణీ చేయడం జరిగింది. అలాగే మహిళలకు రక్త హీనత,గర్భకోశ వ్యాధులు,క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల పై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డా. లీలాకృష,అంగన్వాడీ సి.డి.పి.వో మెహబూబి, సూపర్వైజర్ శివజ్యోతి,అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఏ. ఎన్ .ఎంలు,ఆశ వర్కర్లు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మైకు సెట్టు వితరణ

విశాలాంధ్ర-వాకాడు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మారంశెట్టి శారద కుటుంబ సభ్యులు మారంశెట్టి సాయి కళ్యాణ చక్రవర్తి, సురేఖ, జ్ఞాపిక, చార్వి లు 13 వేల రూపాయల విలువ చేసే మైకు సెట్టును సంస్థ ప్రతినిధులు హేమంత్ శర్మ, విక్రమ్ వర్ధన్ చేతుల మీదుగా ఆలయ నిర్వాహకులు సులభాదేవి, అమలాంబా సమేత పరిపూర్ణానంద స్వామి, శకుంతలకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దీవి అనంత బాబు మాట్లాడుతూ దాతల దాతృత్వంతో ఇటువంటి కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందనీ దాతలకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర భజన సమాజం వారు భజనలు చేశారు. విచ్చేసిన భక్తులకు ప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో దీవి సమర్థ్, గురువులు వెంకటసుబ్బయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ముందస్తుగా దసరా సంబరాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని జయరామరావు వీధిలో గల శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ముందస్తుగా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం సురేష్ దసరా ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుకన్య, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, ఏవో శివకృష్ణమరాజు, డీన్ రమేష్, సి. బ్యాచ్ ఇంచార్జ్ గిరిజ, ప్రైమరీ ఇన్చార్జ్ మాధవి లత, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ గౌరీ, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో ఎంపీడీవో

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని కేపీ అగ్రహారం గ్రామ పంచాయతీ ఎస్టి కాలనీలో పారిశుద్ధ్య పనులు ఎంపీడీవో టీ చంద్రమౌళి, సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ప్రతి పంచాయతీలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. పారిశుధ్యం మెరుగుపడినప్పుడే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని పిలుపునిచ్చారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్టి కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బివి మధుసూదన్, ఏపీవో కవిత, ఐసిడిఎస్ సూపర్వైజర్ అంగన్వాడీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

సెపక్ తక్రాలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన గంగమ్మ గుడి పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర-ఎస్ఆర్ పురం: మండలంలోని గంగమ్మ గుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటేందుకు సిద్ధమయ్యారు. పదవ తరగతి విద్యార్థులు కె.హేమంత్, కె.విష్ణు, 9వ తరగతి విద్యార్థి యోగానందం సెపక్ తక్రా సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కళావతి తెలిపారు. ఈ విద్యార్థులు సెప్టెంబర్ 21 నుండి 22 వరకు అనంతపురం జిల్లా ఉరవకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ దర్శకుడు ఎం. లోకనాదాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, చంద్రశేఖర్, బాబు, పద్మశ్రీ, సరోజమ్మ, జానకిదేవి, సత్య, అరుణకుమారి, ప్రసన్నకుమారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'లో ఎమ్మెల్యే మురళీమోహన్

విశాలాంధ్ర-పూతల పట్టు: పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండలం, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొని దేవతా వృక్షాలను నాటి, నీరు పోశారు. అనంతరం కాణిపాకంలో మానవహారం, ప్రతిజ్ఞతో ప్రజలకు అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన గ్రామాలు, పట్టణాలు, పచ్చదనం నిండిన ఆంధ్రప్రదేశ్ ను సాధించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించే దిశగా ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ గిరిధర్ బాబు, బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిట్టెమ్మ, కాణిపాకం మాజీ సర్పంచ్ మదుసూదన్ రావు, నాయకులు గోపి మరియు మండల నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో పోషకాహార మహోత్సవాలు

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు ప్రాజెక్టు పోషణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు కామరాజు నగర్ ఏరియాలోని 3 అంగన్వాడీ కేంద్రాలు కలిసి ఫుడ్ గ్రూప్ గురించి వివరించడమైనది తండ్రుల ఆధ్వర్యంలో పోషకాహార వంటల పోటీలు మరియు తండ్రుల ఆధ్వర్యంలో పోషణపై కమ్యూనిటీ ప్రతిజ్ఞ నిర్వహించడమైనది. గొల్లపల్లి పీహెచ్సీ పరిధిలోని తడుకు సచివాలయంలో ఆరేటమ్మ కాలనీ యూపీహెచ్సీ పరిధిలో మరియు సిఎల్ఎఫ్ సభ్యులకు పోషకాలపై అవగాహన కల్పించడం అయినది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బి.సంధ్య, బి.గీతాంజలి శ్రీదేవి అనిత తదితరులు పాల్గొని పోషణ మాస ఉత్సవాల కార్యక్రమాన్ని జయప్రదం చేశారు

ముక్కంటి సేవలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ బసంత్ బాలాజీ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఈయనకు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఇన్స్పెక్టర్ సుదర్శన్, ఏపీఆర్వో రవి, స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు రెండో పట్టణంలోని నరసింగ రావు పేటలో ఉన్న సిద్దార్థ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తలమంచి వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ ఆసుపత్రి లో పలు విభాగాల్లో పనిచేసే వైద్యుల తో కలిసి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి 400 మంది కి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పలు సూచనలు, సలహాలు అందచేశారు. భవిష్యత్ లో మరెన్నో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యామిని (షుగరు, బీపీ, విష జ్వరాల వ్యాధి నిపుణులు), డాక్టర్ దువ్వూరు లక్ష్మీ సుధ (దంత వైద్య, నోటి క్యాన్సర్ నిపుణులు), డాక్టర్ జనిత్ రెడ్డి (ఎముకలు, కీళ్ళు, వెన్ను ముక వ్యాధి నిపుణులు), డాక్టర్ స్వప్న గుంటుపల్లి (ప్రసూతి, గర్భ కోశ వ్యాధి నిపుణులు), సిద్ధార్థ ఆసుపత్రి వ్యవస్థాపకులు తలమంచి సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మొక్కలు నాటారు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5 తేదీన గ్రామాలలో మొక్కలు నాటుటకు ఉపాధి హామీ మండల పరిషత్ అధికారులు సంయుక్తంగా మొక్కలను కొనుగోలు చేశారు. అధికారులు తూతూ మంత్రంగా చెట్లు పంపిణీ చేసి చేతులు దులుపుకున్న వైనం పై మొక్కలు నాటలేదు నగదు చెల్లించలేదు శీర్షిక కథను ఆదివారం విశాలాంధ్ర జాతీయ పత్రికలో ప్రచురించిన సంగతి అందరికీ విధితమే ఈ వార్త కథనం ఉపాధి హామీ ఏ.పి.ఒ దేవరి ని.వివరణ అడగగా ఎట్టకేలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల పరిషత్ అభివృద్ధి ఇన్చార్జి అధికారి మోతీ ఉపాధి హామీ సిబ్బంది సంయుక్తంగా స్పందిస్తూ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఇన్చార్జి ఎంపీడీవో మోతి కందకాలు తీశారు, తాసిల్దార్ శ్రీదేవి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో మొదటి మండల విద్యాశాఖ అధికారి కే.రవీంద్రనాథ్, రెండోవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు కే.రమణయ్య, ఉపాధ్యాయుని సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన మందిర స్థలం దురాక్రమణపై

రేపు చలో కలెక్టరేట్

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య మాట్లాడుతూ తిరుపతి జిల్లా దక్కిలి మండలం మోపూర్ రోడ్డు సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన మందిర స్థలాన్ని తమిళనాడు రాష్ట్రాలకు చెందిన దురాక్రమణ దారులు గత సంవత్సరం కాలం నుండి ఆక్రమించుకొని ఉంటే ఈ విషయం మీద ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దక్కిలి మండల తహశీల్దార్కి అనేకసార్లు ఫిర్యాదు చేయడం జరిగినది. అంతేకాకుండా స్థానిక శాసనసభ్యులు సమస్యను పరిష్కరించమని సిఫార్సు చేసినప్పటికీ తహశీల్దార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన మందిర స్థలాన్ని దురాక్రమణ దారులకు కట్టబెట్టడానికి ప్రయత్నం చేయడానికి వ్యతిరేకిస్తూ ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల దళిత గిరిజన సంఘాల కుల సంఘాల వామ పక్షి పార్టీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నూతన మండలాధ్యక్షునికి ఘనంగా సన్మానం

విశాలాంధ్ర-రామకుప్పం: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన వెంకటరమణకు ఎంఆర్పిఎస్ నియోజకవర్గ కో ఇన్చార్జ్ వెంకటేష్, మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో ఎంఆర్పిఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వెంకటరమణ కు దుశ్శాలువలు కప్పి పూలమాలలతో భారీ కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీ సెల్ మణేంద్రం పంచాయతీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనకు దేశం పార్టీ అధిష్టానం గుర్తించి ఆయనసేవలను మండల ప్రజలకు మండల ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఎన్నుకోవడంతో సంతోషంగా ఉందని ఇంతటి పదవికి ఎన్నుకోవడానికి సహాయ సహకారాలు అందించి తనకు పదవిని వరించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని అందరి సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంఆర్పిఎస్ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ రాఘవేంద్ర, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు జయప్ప గోవిందప్ప విజయ్ పళని రమేష్ శంకర్ గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు పురవీధులలో ర్యాలీ

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం జిల్లా పరిషత్ బాలికలఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులందరూ పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మొక్కలు నాటడం పిల్లలకు ఆరోగ్యకరంగా చేతులు, కడుగుట గోర్లు కత్తిరించుట మొదలకు కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మగ్రి శేఖర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్ భారతి వరలక్ష్మి కస్తూరి చిత్రా గీత వేణుగోపాల్ రెడ్డి జయదేవ్, రామ్మోహన్ మునీంద్ర శశికాపూర్ కన్నయ్య పాల్గొన్నారు.

నేడు గూడూరు లో జెండా మహోత్సవం

విశాలాంధ్ర-గూడూరు: దేశంలో మైసూరు తర్వాత గూడూరు పట్టణం లో ఆంజనేయ స్వామి జెండా మహోత్సవం ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా మాదిరిగా ఈ సంవత్సరం కూడా జెండా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణతో పెద్ద, పెద్ద ఆర్చిలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల లో జెండా ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పాఠశాలలు సెలవులు కావడంతో విద్యుత్ అలంకరణలు చూసేందుకు వస్తుండడంతో పండుగ వాతావరణం నెలకొంది. బంధువు, మిత్రులు రాకతో గూడూరులో సందడి నెలకొంది.

డీసీఎంఎస్ ఛైర్మన్ సుబ్రమణ్యం నాయుడు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-చంద్రగిరి: డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శిం చారు. సుబ్రమణ్యం నాయుడు కర్మక్రియల ఏర్పాట్లను స్థానిక కూటమి ప్రభుత్వం నాయకులు, స్థానిక గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. కర్మక్రియల రోజు వర్షం వస్తే వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్‌లో ...

'మన డబ్బులు-మన లెక్కలు'పై అవగాహన

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలోని చిగురువాడ, అవిలాల గ్రామ సమైఖ్యాల్లో శనివారం రెండవ రోజు పైలట్ ప్రాజెక్టుగా 'మన డబ్బులు - మన లెక్కలు' అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీఎన్ శోభన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం సంఘం సభ్యుల లెక్కలు సభ్యుల చేతిలో పెట్టడానికి ఎండిఎంఎల్ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా సభ్యురాలి సమాచారం, పొదుపు, అప్పు వివరాలు, సంఘాల ఉత్పత్తులు, సేవలను ఎప్పుడైనా మొబైల్‌లో చూడవచ్చని వివరించారు. పొరపాట్లు ఉంటే సభ్యులు ప్రశ్నించే హక్కు కలుగుతుందని, దీంతో సంఘాల ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరిగి అవకతవకలు తగ్గుతాయని చెప్పారు. ప్రతి 10 సంఘాలకు ఒక ఈ-నారి సహాయం అందిస్తారని, సభ్యులు వారిని సంప్రదించాలని సూచించారు. అలాగే స్వచ్ఛ భారత్ స్వచ్ఛ దివస్ పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిపియం ఐబి వెంకటేష్, ఎపియం నాగేశ్వరరావు, సీసీలు, సంఘమిత్రలు, సీఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మెనూ చార్జీలు, జీతాలు పెంచాలి: ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి కె.వై రాజా

విశాలాంధ్ర-చంద్రగిరి: ఏఐటియుసి అనుబంద కార్మిక సంఘమైన ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం జిల్లా రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ అక్టోబర్ మాసాలలో జరిగే ఈ మహాసభలను జయప్రదం చేయాలని చంద్రగిరి మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఏఐటియుసి నాయకత్వం కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి కెవై రాజా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లాజరస్ లు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలతో సతమతమవు తున్నారని గత ప్రభుత్వం హామీలు ఇచ్చింది తప్ప అమలు జరపలేదని ఇవ్వగలం పాదయాత్రలోనూ ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు పెద్ద ఎత్తున మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని మెను చార్జీలు పెంచుతామని 3000 రూపాయల కార్మికులకు ఇస్తున్న జీతాన్ని పెంచుతామని హామీలు ఇచ్చారు. తప్ప అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇప్పటికైనా మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్త ఆందోళనలు జరుపుతామని వారు హెచ్చరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని ఉపాధ్యాయులు విద్యా కమిటీలు మధ్యాహ్న భోజన కార్మికుల పనులలో జోక్యం చేసుకోరాదని రాజకీయ వేధింపులు ఆపాలని జిల్లాలో ఈనెల ఆఖరులో మధ్యాహ్నం భోజన కార్మికుల జిల్లా మహాసభలు జరుగుతాయని రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 2 3 వారాలలో జరుగుతాయని ఈ మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పోరాటాలకు రూపకల్పన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా నాయకులు ఇంద్రానమ్మ, నాగమ్మ, నాగేశ్వరమ్మ, నాగమ్మ, బుజ్జి, సుబ్బమ్మ, సరస్వతి, పాల్గొన్నారు.

వినాయక స్వామివారి ఆలయం నందు ఆక్టోపస్ మాక్ డ్రిల్

విశాలాంధ్ర-పూతలపట్టు: వినాయక స్వామివారి ఆలయం నందు శుక్రవారం రాత్రి ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఆక్టోపస్ మాక్ డ్రిల్ ఉగ్రవాద నిరోధక వ్యాయామం, నిర్వహించడం జరిగింది. దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, ఏఎస్పీ నందకిషోర్, ఆక్టోపస్ డిఎస్పి తిరుమలయ్య పోలీసు శాఖ, రెవెన్యూ, అగ్నిమాపక మరియు ఆరోగ్య శాఖల అధికారులు ఇతర అధికారుల ఆధ్వర్యంలో ముందుగా ఉగ్రవాదులు దాడులను నివారించడానికి ఎలా ప్రణాళిక నిర్వహించుకుని తరువాత ఆలయం వద్దకు విచ్చేసి మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పి సాయినాథ్, సీ.ఐ శ్రీధర్ నాయుడు, చిత్తూరు పోలీస్ శాఖ అధికారులు, ఐరాల ఎమ్మార్వో లోకేశ్వరి, పీహెచ్సీ డాక్టర్ రాజేశ్వరి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఏ.ఈ శివాంజనేయులు, పవన్, కాణిపాకం ఎస్సై నరసింహులు, బాంబు స్క్వాడ్ బృందం, అగ్నిమాపక శాఖ బృందం, ఆక్టోపస్ బృందం పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పురపాలక సంఘ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర -2025 సెప్టెంబర్ నెల థీమ్ గ్రీన్ ఏపీలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ వారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీ బాయ్స్ హాస్టల్ నందు మొక్కలు నాటి గ్రీన్ ఏపీ ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడుతూ చెట్లు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత, ప్రతి ఒక్కరూ మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలుజేశారు. ప్లాస్టిక్ కూడా పర్యావరణాన్ని నాశనం చేస్తుందని, అక్టోబర్ 2 నుండి ప్రతి గవర్నమెంట్ ఆఫీసులో పూర్తిగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం అని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ఈ విద్యా సంవత్సరానికి విద్యా ప్రమాణాలు మార్పులు చేర్పులు చోటు చేసుకోవడం వలన ప్రభుత్వ పాఠశాలలో గణనీయంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. బడి ఈడు పిల్లలను బడిలో చేర్చే విధంగా ప్రతి ఉపాధ్యాయులు పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నెలవాయి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాశాఖ అధికారులైన మొదటి మండల విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్, రెండోవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకోవడం వల్ల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లలేకపోయారు. ప్రతి ఉపాధ్యాయుడు హాజరు తగ్గిపోకుండా బడి ఈడు పిల్లలను గుర్తించి బడులో చేర్చే బాధ్యత మనపై ఉన్నదన్నారు. విద్యార్థుల నైపుణ్యత తీసుకురావడానికి ఈ సమావేశం ద్వారా ప్రాథమిక పుస్తక అంశాలపై ముందస్తుగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణం మెరుగుపరుచుకోవాలన్నారు. పాఠశాల నిర్వహణ విద్య కార్యకలాపాలపై ప్రతి ఉపాధ్యాయుడు సమావేశంలో చర్చించుకో వాలన్నారు. విద్యార్థులు సమస్యను చర్చించి పరిష్కరించు కోవడం కూడా ఉపయోగపడుతుంది. ఈ సమావేశాలకు నిర్దిష్ట ఎజెండా మార్గదర్శకాలు టైమ్ టేబుల్ రూపొందించబడుతుంది. ఉపాధ్యాయులు మరియు విద్యా అధికారులు సమావేశంలో సంబంధించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఏర్పాటు చేసుకున్న అజెండా మీ పాఠశాలలో నిర్వహించాలన్నారు. వికాసం ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలను పరిశుభ్రంగా ఉంచుదాం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కళాశాలు పరిశుభ్రంగా ఉంచుదామని ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు అన్నారు. పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా గ్రీన్ ఏసీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంచేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ కళాశాలను పరిశుభ్రంగా ఉంచుకుందామన్నారు. అదే విధంగా మొక్కలను నాటి పచ్చదనం పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుధీర్, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్ఎన్ హై స్కూలులో ముందస్తు దసరా వేడుకలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం లక్ష్మీనరసింహ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తుగా దసరా పండుగ వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటామని తెలియజేశారు. పాఠశాలలో విజయదశమిలో భాగంగా విద్యార్థులు వివిధ అమ్మవారి వేషధారణలో కనిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చిన్నారుల వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్లు దిలీప్ కుమార్, ధనుంజయ రెడ్డి, పురుషోత్తం, హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు యూనిఫాం వితరణ

విశాలాంధ్ర-పాకాల: పాకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాకాల పూర్వ విద్యార్థుల సంఘం వారు శనివారం యూనిఫాం వితరణ చేశారు. కళాశాలలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాకాల జూనియర్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం వారు 30 మంది విద్యార్థులకు 30 జతల యూనిఫామ్ ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు లింగయ్య నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు తమ వంతు తోడ్పాటు అందించాలని ఉద్దేశంతో యూనిఫాం అందజేసినట్లు తెలియజేశారు. ప్రభుత్వ కళాశాలలో మంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని వారి బోధనతో, సూచనలతో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు హరికృష్ణ మూడు తివాచి లను కళాశాలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జయ చంద్రన్ , హరినాథ్ ఆచారి ముని రాజ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె,మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు రామకృష్ణ శర్మ పాల్గొన్నారు.

డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం: సీఐ జయచంద్ర

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ఆటో స్టాండ్, సుమో స్టాండ్ డ్రైవర్లతో శనివారం సిఐ జయచంద్ర ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా తిరుమల బ్రహ్మోత్సవాల నిమిత్తం నలు దిక్కుల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తారని తెలిపారు. వారి పట్ల దురుసుగా ప్రవర్తించకూడదని సూచించారు. ముఖ్యంగా గరుడ సేవ రోజు అధిక చార్జీలు వసూలు చేయకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ఎంతో ముఖ్యం

విశాలాంధ్ర-పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బంగారు రాష్ట్రంగా మార్చడానికి మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పచ్చదనాన్ని పెంచుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే.. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో ఈరోజు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో చెట్లను నాటడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర అంటే అభివృద్ధి అని, స్వచ్ఛ ఆంధ్ర అంటే పరిశుభ్రత అని అన్నారు. అన్ని ప్రభుత్వ సంస్థలు, ప్రజలు పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడంతో పాటు చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసులు, బాబురావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుజనా, డాక్టర్ వి.వాసవి, టి.నరసింహులు, ఎస్ పద్మావతి ఫిజికల్ డైరెక్టర్ సూర్య బాబు తదితర అధ్యాపకులు.. విద్యార్థిని విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛతా తోనే సాధ్యం

విశాలాంధ్ర-పాకాల: పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛత కార్యక్రమా లతోనే సాధ్యమవుతుందని పాకాల ఎంపీడీవో వాసుదేవరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం లో భాగంగా హరిత ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడి ,స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో భాగమవుతామని హరిత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, ఈఓఆర్డి శశిరేఖ, ఏపీవో ఆశా రాణి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల పనుల పరిశీలన

విశాలాంధ్ర-ఎస్.ఆర్.పురం: చిత్తూరు జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ వి.రవికుమార్ నాయుడు శనివారం పాతపాలెం హరిజనవాడ మరియు గెడ్డమాకరాజపురం పంచాయతీ పరిధిలోని కొండపాళ్యం ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. పాతపాలెం హరిజనవాడ ప్రజల అభ్యర్థన మేరకు మూడు వీధులకు కొత్త మురికికాలువల నిర్మాణానికి ఆమోదం లభించిందని ఆయన తెలిపారు. అలాగే గ్రామంలో నీటి సరఫరా సమస్యల పరిష్కారం కోసం నీటి ట్యాంకుకు మరమ్మతులు చేసి, పైపులను మార్పిడి చేయాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదనంగా, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద పాతపాలెం హరిజన వాడకు రూ.20 లక్షల నిధులు మంజూరైన నేపథ్యంలో అవసరమైన పనులను త్వరితగతిన చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆయన గెడ్డమాక రాజపురం పంచాయతీ పరిధిలోని కొండపాళ్యం ఎస్టీ కాలనీని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద పారిశుద్ధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించగా, మొక్కల నాటకం కూడా నిర్వహించారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించిన అనంతరం ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. వనజ, పరిపాలన అధికారి జె. మోహన్ మురళి, ఉప ఎంపీడీవో కేశవులు, పంచాయతీ రాజ్ ఏఈ సునీల్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మాధవ్, గెడ్డమాకరాజపురం పంచాయతీ కార్యదర్శి సమీరా బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరిలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-చంద్రగిరి: ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన సందర్భంగా చంద్రగిరిలో ఆ పార్టీ నాయకులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భారతీయ జనతా పార్టీ చంద్రగిరి మండల పార్టీ ఆధ్వర్యంలో బిజెపి మండల అధ్యక్షులు కాకి మాను మునిరాజు అధ్యక్షతన ఈ రక్తదాన శిబిరం జరిగినది. ఈ కార్యక్రమమునకు భారతీయ జనతా పార్టీ జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజలకు తెలియజే యాలని కోరారు. అనంతరము కార్యక్రమం లో రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకట ముని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం యాదవ్, జిల్లా బిజెపి కార్యదర్శులు ఖాయం హరినాథ్ రెడ్డి, శ్రీధర్ బాబు, సునీల్ కుమార్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మునిగంగి రెడ్డి, మండల నాయకులు టిఎవి ప్రసాద్, మహిళా మోర్చా నాయకురాలు ప్రశాంతి, ఇందు శేఖర్, దొరస్వామి, నరేష్ కుమార్ నాయుడు, కృష్ణ, పుష్పలత, మోహన్ రాజులు, పురుషోత్తం రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్ కూడలి వద్ద ట్రాఫిక్ సమస్యకు చెక్

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని బస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న వాహనదారులకు ఊరట లభించింది. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభంను శనివారం తొలగించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ నిత్యం వాహనాలతో రద్దీగా ఉన్న బస్టాండ్ కూడలి వద్ద కరెంటు స్తంభం వలన వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఈ సమస్యను శ్రీకాళహస్తి నియోజకవర్గపు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారుల సహకారంతో కరెంటు స్తంభం తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో కొరియర్ రవి, జగదీష్, దీపీ నాదం, శ్రీకాళహస్తి కాన్స్టిట్యూషన్ మైనార్టీ ప్రెసిడెంట్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

శక్తివంతమైన ఆహారమే ఆరోగ్యం: డా. భువనేశ్వరి

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం మండలం, సిడి కండ్రిగ పంచాయతీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి ఉద్యోగులు కలిసి స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భువనేశ్వరి విచ్చేసి అధిక సంఖ్యలో వచ్చిన మహిళలను వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని జాగ్రత్తలు సలహాలను వివరించారు. అనంతరం అంగన్వాడి ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్ పరిశీలించి గర్భిణీ స్త్రీలకు వారి ఆరోగ్యంతో పాటు బిడ్డ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఇటువంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, వంటకాలను రుచి చూసి అంగన్వాడి ఉద్యోగులను అభినందించి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ అసిస్టెంట్ అంబరీష్ రాజు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరు, గంజాయి కేసులో మరొకరు అరెస్ట్

విశాలాంధ్ర-సత్యవేడు: హత్యాయత్నం కేసుకు సంబంధించి తిరుపతి జిల్లా సత్యవేడు హరిజనవాడకు చెందిన నిందితుడు సైమన్(25)ను స్థానిక పోలీసులు శనివారం అరెస్టు చేయగా, గంజాయి కేసులో సత్యవేడు పట్టణం దలవాయి అగ్రహారంకు చెందిన నిందితుడు శ్రీధర్(34) ను శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడు శ్రీధర్ నుంచి ఒకటిన్నర కిలోల గంజాయి, హీరో స్ప్లెండర్ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో గంజాయి కేసుకు సంబంధించిన నిందితుడు శ్రీధర్‌ను శుక్రవారమే కోర్టుకు హాజరు పరిచి రిమాండుకు పంపారు. ఈ నేపథ్యంలో హత్యాయత్నం కేసుకు సంబంధించిన నిందితుడిని శనివారం సర్కిల్ కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మురళినాయుడు మాట్లాడుతూ జూలై 15వ తేదీన శ్రీసిటీ కంపెనీలో పని ముగించుకుని రాత్రివేళ ఆటోలో వారి గమ్యస్థానాలకు వస్తున్నారు. ఈ క్రమంలో సత్యవేడు శ్రీకాళహస్తి బస్టాప్ సమీపంలో సీమాన్ తన ద్విచక్ర వాహనంలో వచ్చి ఆటోకు అడ్డంగా నిలిపి గందరగోళం సృష్టించి ఆటోలో ఉన్న వారితో గొడవకు దిగారు అన్నారు. ఈ నేపథ్యంలో తోపులాట కూడా చోటు చేసుకుందన్నారు. నాతోనే గొడవ ఒక దిగుతారా అంటూ సీమాన్ ఆటో వారితో గర్జించారన్నారు. దీంతో కొన్ని రోజుల్లోనే ఒక పథకం ప్రకారం సీమాన్, ఆయన అన్న లారెన్స్ ఇంకా కొందరు కలిసి రాత్రి వేళ సత్యవేడు స్టేట్ బ్యాంకు వద్ద కాపు కాచి ఆటోలో ఇంటికి వెళ్తున్న వారిని ఆపి గొడవకు దిగారన్నారు. పైగా సీమాన్ ఆయన అన్న లారెన్స్ కలిసి ఆటోలో ఉన్న వారిపై కట్టెలతో తలపై చాతిపై కొట్టి రక్త గాయం పరిచారన్నారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసుగా నమోదు చేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిందితుడు సీమాన్‌ను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మరొక నిందితుడ్ని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. వీరిద్దరిపై తడ, తమిళనాడు పోలీస్ స్టేషన్లో పలు కేసులో నమోదైనట్టు వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రామస్వామి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మహాలయ అమావాస్య పితృతర్పణం

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు, నగరి, వడమాల పేట కపిలేశ్వర స్వామి ఆలయంలో కపిలేశ్వర పురోహిత సంఘం మరియు శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవాలయం, చంద్రగిరి, తొండవాడలో దేవేంద్ర థియేటర్ శివాలయంలో, తొండవాడలో తదితర ప్రాంతాల్లో పితృదేవోతాది తపనాలు కార్యక్రమం నిర్వహిం చబడతాయి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అధికార ప్రతినిధి శ్రీ బాలాజీ శర్మగారు తెలిపారు.. ఈ మహాలయ అమావాస్య రోజున పితృదేవతాకు తర్పణం చేయడం ద్వారా వారికి పితృ సంతోషం కలుగుతుంది, అలాగే సద్గతి ప్రాప్తి కలుగుతుంది. ఆ రోజున మనమందరం కూడా తర్పనాది కార్యక్రమాలు చేయడం ద్వారా మనకు మరియు పితృదేవతలకు చాలా మంచిది మన ప్రాంతంలో మామూలుగానే సంక్రాంతి పండగ రోజున జరుపు తాము అది ఆనవాయితీ... కానీ శాస్త్ర ధర్మ ప్రకారంగా పితృపక్ష కాల మందు అంటే భద్రత శుక్ల పక్షం అంటే పౌర్ణమి తర్వాత పౌర్ణమి నుండి అమావాస్య వరకు భాద్రపద బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకు ఈ మధ్య 15 రోజులను మహాలయ పితృపక్షాలు అంటారు. ఆ రోజులలో ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తారు. ఇందులో విశేషంగా అమావాస్య అంటే విశేషమైన రోజు ఈ అమావాస్య కనుక అందరూ కూడా తిలతర్పణాది కార్యక్రమాలు చేయండి చాలామం చిది. అలాగే బ్రాహ్మణులకు భోజనానికి సరిపడా స్వయంపాక ధర్మాలు చేయండి.. పితృదేవతల అనుగ్రహం పొందండి ప్రతి ఒక్కరిని కోరుతూ పురోహితులందరూ మీ అందరి పితృదేవతల తల తర్ప ణాది కార్యక్రమంలో నిర్వహించుకొనుటకు వీలుగా ఉంటుంది. ఈ సందర్భంగా ఈ అమావాస్య ఎంతో పవిత్రమైన దినమని పేర్కొన్నారు.

శ్రీమద్వెంకట రామమూర్తి స్వామికి మత్స్య అలంకారం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణం లో వెలసి ఉన్న శ్రీమద్వెంకట రామమూర్తి స్వామి వారి ఆలయం లో పెరటాశి మాసం ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. స్వామి వారికి తెల్లవారు జామున వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు చేసి మత్స్య అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు పర్యవేక్షణలో పూజలు నిర్వహిస్తున్నారు.

సూళ్లూరుపేటలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా'

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా మరియు ఈ సంవత్సరం అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని తేదీ:18.09.2025 నుంచి తేదీ:02.10.2025 వరకు "స్వచ్ఛత హీ సేవ" మరియు కార్యక్రమం చేయుటకు గౌరవ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పురపాలక సంఘం కార్యాలయం నుండి స్థానిక పాండురంగ స్వామి గుడి వరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛత హి సేవ మరియు అంగీకార్ -2025 ప్రచార అవగాహనా ర్యాలీ జరిగినది మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ మాట్లాడుతూ పుర వీధిలో చెత్త వేయరాదని అటులనే ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేశవ్, సూళ్లూరుపేట పురపాలక సంఘం శానిటరీ ఇన్స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు సచివాలయ పారిశుధ్య మరియు పర్యావరణ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది శానిటరీ మేస్త్రిలు మరియు పారిశుధ్య కార్మికులకు పాల్గొన్నారు.

వారాహి విద్యా వికాస్‌లో మాస్టర్ చెఫ్ పోటీలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణం లోని స్థానిక వరద నగర్ లో ఉన్న వారాహి విద్యా వికాస్ పాఠశాలలో మాస్టర్ చెఫ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలచే తయారు చేయబడిన ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు పరిశీలించి పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఆహారాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకొని నిర్వహించే ఒక పండుగ అన్నారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులుకడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ బడి అంటేనే చదవటం రాయటం కాదని జంక్ ఫుడ్‌తో పోషకాలు ఉన్న ఆహారాన్ని మర్చిపోతున్న ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ వంటకాల ప్రాధాన్యత తెలిపే ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత మోనిష్, చైర్మన్ గుణవతి, పాఠశాల ప్రిన్సిపల్ కె.చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దశరా శెలవుల్లో పిల్లల బాధ్యత తల్లితండ్రులదే

సి.ఐ.. సోమశేఖర్

విశాలాంధ్ర-వి.కోట: పాఠశాలలకు దశరా శెలవులు వచ్చినందున పిల్లలను కని పెట్టుకొని ఉండాల్సిన బాధ్యత తల్లి తండ్రులు కలిగి ఉండాలని స్థానిక అర్బన్ సిఐ సోమశేఖర్ రెడ్డి కోరారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే చెరువులు, కుంటలు నిడిపోయి ఉన్నాయని అంతేకాక హంద్రీనీవా కాల్వద్వారా నీరు దాదాపు నాలుగు నుండి ఐదు అడుగుల లోతున ప్రవహిస్తోందని పిల్లలు ఈత సరదాతో ఇళ్లనుండి చెరువులు, కుంటలు, కాల్వల వైపు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. శెలవులు ఇళ్ల వద్ద సరదాగా గడుపుకొని తిరిగి పాఠశాలలకు కాలేజీ లకు సంతోషంగా వెళ్లాలని వెళతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

దివ్యాంగ విద్యార్థుల కలల సాధనకు కూటమి ప్రభుత్వం కృషి

పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

విశాలాంధ్ర-పూతలపట్టు: దివ్యాంగుల విద్యార్థుల కలల సాధనకై కూటమి ప్రభుత్వం పటిష్టమైన కృషి చేస్తోందని పూతలపట్టు శాసనసభ్యులు మురళీ మోహన్ పేర్కొన్నారు. శనివారం తవణంపల్లె మండల కేంద్రంలో పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో తవణంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో పూతలపట్టు నియోజకవర్గ స్థాయి మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరానికి పూతలపట్టు, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లి, యాదమరి మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారు. నడవలేని పిల్లలు, వినికిడి లోపం ఉన్న విద్యార్థులు, చూపు సమస్యలు గల వారు, బుద్ధిమాంద్యం గల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు వైద్యులు అందించారు. 6 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్న సందర్భంగా "పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రోత్సహించారు. ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్ళాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇంఛార్జ్ సునీల్ చౌదరి, మాజీ మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, నాయకులు ప్రవీణ్ కుమార్, పట్నం గోపి, తవణంపల్లె మండల విద్యాశాఖ అధికారులు హేమలత, మోహన్ రెడ్డి, వైద్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాణిపాక ఆలయ సిబ్బందికి బ్రహ్మోత్సవ కానుక

విశాలాంధ్ర-పూతలపట్టు: వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా కాణిపాకం ఆలయ సిబ్బందికి బ్రహ్మోత్సవ కానుకను పూతలపట్టు శాసన సభ్యులు మురళీ మోహన్ అందజేశారు. శనివారం మధ్యాహ్నం కాణిపాకం అతిథి గృహంలో ఆలయ సిబ్బందితో ఎమ్మెల్యే మురళీ మోహన్ సమావేశమై బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు విశేష సేవలు అందించిన సిబ్బందిని అభినందించి ఆలయ సాంప్రదాయం ప్రకారం 550 బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఆలయ ఈవో పెంచల కిషోర్, కాణిపాకం దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం అలవాటుగా పెట్టుకోవాలి

విశాలాంధ్ర-పుత్తూరు: ప్రభుత్వ పాలిటెక్నిక్, పిల్లారిపట్టులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాం నిర్వహించారని ప్రిన్సిపాల్ ఎస్వీ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు చెట్టు పెంచడం అనేది ఒక్క అలవాటుగా పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా పుత్తూరు మున్సిపల్ కమిషనర్ శ్రీ మంజునాథ్ గౌడ్ శుక్రవారం నాడు వచ్చి కళాశాలలో ఆవరణలో పలురకాల చెట్లను నాటారు.తరువాత ఆయన మాట్లాడుతూ కాలుష్యం తగ్గించాలంటే చెట్లను నాటడం ద్వారా కొంత వరకు నిర్మూలించవచ్చు అని పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ మన ఇంటి దగ్గర కళాశాలలో ఉద్యోగం చేస్తున్న దగ్గర ఒక్క చెట్టును నాటి పెంచితే మనమందరిని చూసి మరికొందరు చెట్లు నాటి పెంచడానికి ముందుకు వస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, మున్సిపల్ కమిషనర్,అధ్యాపకులు మరియు విద్యార్థులచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ, చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ సాగర్, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక జీవితంతో ఆడుకున్న శాడిస్ట్ భర్త

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం కోట్రేపల్లికి చెందిన ప్రకాష్ కుమార్తె శిరీష తన భర్త మిట్టపల్లి కి చెందిన సంపంగి కుమారుడు శివాజీ తనను నాలుగు నెలల ముందు మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్నాడని ఆ సమయంలో తమ తల్లిదండ్రులు 5 లక్షల నగలను వేశారని పేదవారైనా తమ తల్లిదండ్రులకు నలుగురు సంతానమని వారిలో పెద్దదైన శిరీషను సంపంగి ఆయన భార్య మాయ మాటలు చెప్పి డబ్బు ఆశ చూపించి ప్లాటు తన పైన చేపిస్తామని చెప్పి వివాహం చేశారని. ఇప్పుడు శివాజీ తనను వేధిస్తున్నాడని బైరెడ్డిపల్లి మండల పోలీస్ వారికి ఫిర్యాదు చేసినది. తన భర్త ప్రతిరోజు తనను కొడుతూ రక్త గాయాలు చేస్తూ, శారీరకంగా, మానసికంగా, హింసిస్తున్నాడని, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, కట్నం తేవాలని వేధిస్తున్నాడని, మైనర్ అయిన తనకు ఇటువంటి వాడితో వివాహం చేశారని, ఇంటర్మీడియట్లో 1000 కి 900 మార్కులు తమకు వచ్చాయని, తమకు న్యాయం చేయాలని ఆమె విన్నవించుకున్నది. ఆమె ఫిర్యాదును తీసుకున్న పోలీసు వారు దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్య కార్యక్రమాలతోనే పరిశుభ్రతపై అవగాహన సాధ్యం

విశాలాంధ్ర-పాకాల: విద్యార్థులలో పరిశుభ్రత పై అవగాహన చైతన్య కార్యక్రమాలతోనే సాధ్యమవుతుందని మగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత తెలిపారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం మొగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు "స్వచ్ఛ భారత్ మిషన్ "నిర్వహణపై చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు .విద్యార్థులచే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం, స్వచ్ఛతా ప్రతిజ్ఞ, స్వచ్ఛతా నినాదాలు చేశారు .ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుమలత మాట్లాడుతూ స్వచ్ఛతపై ఇలాంటి అవగాహన కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించడం ద్వారా విద్యార్థులలో వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల పరిశుభ్రత ,పారిశుద్ధ్యం ,ప్లాస్టిక్ నిషేధం ,నీటి పొదుపు, మరుగుదొడ్ల వినియోగం, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణపై మంచి అవగాహన కల్పించవచ్చునన్నారు. ఉపాధ్యాయులు నీరజ, విమలా విక్టోరియా, ఆదికేశవులు, సుల్తాన్, రామమూర్తి, బాబు పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి బాలుడు మృతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: సరదాగా స్నేహితులతో ఆడుకుంటూ ఈత కొడదామని పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన నలుగురు విద్యార్థులు స్వర్ణముఖిలో దిగి ఈత కొడుతుండగా నది ప్రవాహం అధికంగా ఉండడంతో హా రుణ్. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన స్థానికులకు కంటతడి పెట్టించింది. అయితే మరో విద్యార్థి ఆచూకీ ఇంకా తెలియలేదు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది నదిలో మరో బాలుడు ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మృతి చెందిన విద్యార్థి ని మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న అరుణ్ అనే వ్యక్తి తోటి స్నేహితులు అరుపులతో అక్కడకు చేరుకుని మృతి చెంది కొట్టుకుని వెళ్తున్న విద్యార్థిని తీసుకొని గట్టుకు చేర్చాడు. వెంటనే స్థానికుల సమాచారంతో పోలీసులు నలుగురు విద్యార్థుల్లో ఒక విద్యార్థి మృతి చెందడం, మరో విద్యార్థి ఆచూకీ తెలియక పోవడంతో స్వర్ణముఖి నదులు గాలిస్తున్నారు. మృతి చెందిన విద్యార్థి తండ్రి ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తుండడం మృతి చెందాడన్న విషయం తెలవడం తో తల్లిదండ్రులు బంధువులు రోదనలు వర్ణతీతంగా స్వర్ణముఖి నది ఒడ్డున బోరున్న విలపిస్తూ దేవుడా ఎందుకు మా బిడ్డను బలి తీసుకున్నావ్ అంటూ రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్ కి తరలించారు.

గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించండి

విశాలాంధ్ర-పెద్దపంజాణి: అని నేడు పుంగనూరు నుండి బెంగళూరుకు వెళ్లే రహదారి, కత్తార్లపల్లె దగ్గర ఉపాధ్యాయులు తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ నిత్యం విపరీతమైన రద్దీ వున్న, పుంగనూరు బెంగళూరు రోడ్డు కత్తార్లపల్లె దగ్గర అతిపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు బోయకొండ కు వెళ్లే భక్తులు, ప్రమాదాలకు లోనవుతున్నారని, గత కొన్ని సంవత్సరాలుగా పుంగనూరు పుంగమ్మ చెరువు కట్ట నుంచి కత్తార్లపల్లె వరకు దాదాపు 3 కిలో మీటర్లు రోడ్ అధ్వాన్నంగా వున్నదని, కనీసం కత్తార్లపల్లె దగ్గర ఏర్పడిన అతిపెద్ద గుంతలను త్వరితగతిన పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్ రెడ్డి, గోపి, జనార్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీధర్, ప్రసన్నలక్ష్మి, బాబాజాన్, అమర్నాథ్, మురళి, సరస్వతి అన్నదొరై, రఫీ మరియు ఉపాధ్యాయులు ప్రజలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు, అధికారులు

విశాలాంధ్ర-వి.కోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని చెత్తనుండి సంపద కేంద్రం వద్ద మండలంలోని స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ తో పాటు మండలం లోని తెలుగు దేశం పార్టీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమం తెదేపా మండల అధ్యక్షులు, రాష్ట్ర వేర్ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ రంగనాథ్, సింగిల్ విండో ఛైర్మెన్ నారాయణ స్వామి, మండల తెలుగు యువత అధ్యక్షుడు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, ఆర్. ధీరజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సి. రామచంద్రనాయుడు క్లస్టర్ ఇన్చార్జి బి.ఆర్ రాంబాబు, నాయకులు సామిల్ సుబ్బన్న, సతీష్, ముకుందనాయుడు, గౌస్ పీర్, అప్పొళ్లు, పంచాయతీ ఇన్చార్జి కార్యదర్శి నరేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర - చిత్తూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యశాల అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పునరుత్పత్తి మాతా శిశు ఆరోగ్య సేవల పైన జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాలకే తప్పక చేయాలని తెలిపారు. ఇప్పటికీ 80 శాతం మాత్రమే పూర్తయిందని మిగిలిన 20 శాతం వారం లోపల పూర్తి చేయాలి. హైరిస్క్ గర్భిణీ స్త్రీలను, టీనేజ్ గర్భిణీలను నమోదు చేసినప్పటి నుంచి కాన్పుకు వారం ముందు హాస్పిటల్ లో జాయిన్ చేసే వరకు తప్పక ఫాలోఅప్ ఉండాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని కాన్పులు ఆస్పత్రి నందు జరిగేలా చూడాలని, గర్భిణీ స్త్రీలకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఇంప్రూ చేయించాలని తెలిపారు. అత్యవసర సేవలు తప్ప ప్రతి ఆరోగ్య సేవలను వి. హెచ్.సి నందే ఇవ్వాలని తెలిపారు. అందరి గర్భిణీ స్త్రీలకు అభ ఐడి క్రియేట్ చేయాలని, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన క్రింద మొదటి కాన్పు, ఇద్దరు ఆడపిల్లలకు 6000 తప్పక ఇప్పించాలన్నారు. శిశువుల ఆరోగ్యానికి సంబంధించి వ్యాధి నిరోధక టీకాలను డ్యూ డేట్ ప్రకారం అన్ని టీకాలు ఇవ్వాలని, ఎం ఆర్ 1, ఎం ఆర్ 2 తక్కువ శాతం ఉన్నందున వాటిని 100 శాతానికి తీసుకురా వాలని తెలిపారు. తక్కువగా ఉన్న వాటన్నిటిని వారం లోపల వంద శాతానికి తీసుకురావాలని తెలిపారు. వి హెచ్ సి డాక్టర్లందరూ ప్రతిరోజు వీటిపై రోజువారి మానిటర్ చేసి ఇంప్రూవ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, డాక్టర్ వెంకట ప్రసాద్, డా.హనుమంత రావు, డా.అర్పిత, ప్రోగ్రాం అధికారులు, వి హెచ్ సి డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యోగుల సమస్యలను..

తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : విద్యుత్తు ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అన్ని ఉద్యోగ సంఘాలు ఏకమై ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం రోడ్డెక్కారు. విధులు బహిష్కరించి కార్పొరేట్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని గతంలో అంగీకరించి ఆ పై అమలు పరచకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించి విధులకు ఆటంకం లేకుండా చేడాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నేతలు దేవేంద్ర రెడ్డి, గోపి, ఐ.సుబ్రమణ్యం, చలపతి, జనార్దన్‌రావు, నందగోపాల్, జయరామయ్య, మునస్వామిలు మాట్లాడుతూ ఇప్పటికే సమస్యలకు సంబంధించిన నోటీసును యాజమాన్యంకు ఇచ్చామని, ఆ సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా ఆందోళనలు చేపడతామని ముందే చెప్పడం జరిగిందన్నారు. గతంలో కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని నమ్మించి ఆ పై అమలు చేయకుండా వదిలేశారన్నారు. అత్యవసర రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులను యాజమాన్యం ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదని హితవుపలికారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నేతలు జనార్దనరావు, వేణు, గుణ, నాగరాజులతో పాటు వంద మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ప్రయత్నాలు విఫలం...!

కొట్టే సాయి ప్రసాద్ కే 'మండలి' అధ్యక్ష పదవి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్ష పదవి విషయంలో స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు విఫలం అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయిప్రసాద్ నే ఛైర్మన్ గా కొనసాగిస్తామని టీడీపీ అధిష్టానం స్పష్టం చేసినట్లు సమాచారం. కొట్టే సాయిప్రసాద్ కు 'మండలి' అధ్యక్ష పదవి కేటాయించడంతో ఎమ్మెల్యే బొజ్జల సుదీర్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఈయనతో శ్రీకాళహస్తి టీడీపీ నేతలు అధిష్టాన నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఈ విషయంలో పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మండలి అధ్యక్ష పదవికి టీడీపీ సీనియరు నేత రంగినేని చెంచయ్యనాయుడు పరిశీలించాలని ఎమ్మెల్యే బొజ్జల సుదీర్ రెడ్డి రాష్ట్ర నేతలకు నేరుగా విజ్ఞప్తి చేశారు. అయితే టీడీపీ రాష్ట్ర నేతలు ఇందుకు అంగీకరించలేదని తెలిసింది. కొట్టే సాయి ప్రసాద్ విషయంలో కూటమి నేతలు సమిష్టిగా నిర్ణయం తీసుకున్నారని... ఇక మార్పు చేసే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి తన ప్రయత్నం విరమించుకున్నట్లు తెలిసింది. కాగా ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుని విషయంలో టీడీపీ అధిష్టానం పునరాలోచించడానికి నిరాకరించడంతో ఆ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- డిఆర్డిఏ పిడి శ్రీదేవి

విశాలాంధ -చిత్తూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని చిత్తూరు డిఆర్డిఏ పిడి శ్రీదేవి తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు జిల్లా సమాఖ్య ఆవరణలో మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల శుభ్రత లో పాల్గొని పచ్చదనముతో నిండిన ఆంధ్రప్రదేశ్ దిశగా కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం తో పాటు కలుషితం కాని నీటిని అందించాలంటే మొక్కలు నాటడంతోపాటు భూగర్భ జలాల పెంపుకు అందరూ పాటుపడాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని దీనిని ప్రతి ఒక్కరు గుర్తించి ఈ దిశగా తమ వంతు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రవికుమార్, ఏపీఎంలు హేమ పలువురు జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అపోలో యూనివర్శిటీలో అరుదైన స్టాంపుల ఎగ్జిబిషన్

ఘనంగా అపోలోపెక్స్ -2025 ప్రారంభం - తరలివచ్చిన వేలాది మంది విద్యార్థులు, సందర్శకులు

విశాలాంధ్ర - చిత్తూరు : ది అపోలో యూనివర్సిటీ చరిత్రలో ఒక మధుర ఘట్టంగా నిలిచిపోయే అరుదైన తపాలా ప్రదర్శన "అపోలోపెక్స్ 2025" శనివారం ఘనంగా ప్రారంభమైంది. యూనివర్సిటీ ఫిలాటెలీ క్లబ్ ఆధ్వర్యంలో, మణిపాల్ ఫిలాటెలిక్, న్యూమిస్మాటిక్ క్లబ్, ఇండియన్ పోస్టల్ శాఖల భాగస్వామ్యంతో యూనివర్సిటీ క్యాంపస్లోని డా. ప్రతాప్ సి. రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో ఈ స్టాంప్ ఎక్స్పో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వైస్ చాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, చిత్తూరు పోస్టల్ సూపరింటెండెంట్ భనవంత్ లక్ష్మణ్ నాయక్, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కి చెందిన ప్రొఫెసర్లు డా. కిరణ్ ఆచార్య, డా. నిశాంత్ భట్, డా. వి. పి. రాంప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. చిత్తూరు జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్ స్టాంప్ ఎక్స్పోను సందర్శించి, నిర్వాహకులకు అభినందించారు. వైస్ చాన్సలర్ డా. వినోద్ భట్ మాట్లాడుతూ "స్టాంపులు ఒక దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వం, సాంకేతిక అభివృద్ధిని ప్రతిబింబించే మౌన సాక్ష్యాలు. విద్యార్థులు ఇలాంటి ప్రదర్శనల ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలి" అని అన్నారు. భనవత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన అపోలో యూనిర్సిటీని అభినందించారు. అరుదైన స్టాంపుల వెనుక మౌనచరిత్రలుఈ ప్రదర్శనలో మొత్తం 60 ఫ్రేములు అరుదైన స్టాంపులు, చారిత్రక లేఖల కవర్లు, పోస్టల్ ఎన్వెలప్స్ ప్రదర్శనకు ఉంచారు. ప్రత్యేకంగా మణిపాల్ ఫిలాటెలిక్ అండ్ న్యూమిస్మాటిక్ క్లబ్ అందించిన 40 ఫ్రేముల కలెక్షన్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కలెక్షన్లలో పులి అడవుల అధిపతి, నీటి పక్షులు, వాతావరణ మార్పులు, ఫిలాటెలీ అక్షరమాల, బ్రిటిష్ రాజ్, జాతీయఅంతర్జాతీయ దినోత్సవాలు, హిందూ దేవాలయాలు, రోటరీ ఇంటర్నేషనల్, రాశిచక్ర చిహ్నాలు, సబ్మెరైన్లు జలయానాలు, స్టాంపులలో వైద్యం, స్టాంపులలో అంతరిక్షం వంటి విభిన్న అంశాలపై ప్రదర్శించిన స్టాంపులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పటికే కర్ణాపెక్స్, సిపా, కృష్ణాపెక్స్ వంటి జాతీయ స్థాయి తపాలా ప్రదర్శనల్లో రజత, స్వర్ణ పతకాలు, "ఉత్తమ ప్రదర్శన" అవార్డులు గెలుచుకున్న కలెక్షన్లు కావడం ఈ ప్రదర్శన ప్రతిష్ఠను మరింత ఇనుమడింపచేశాయి. విద్యార్థుల ఉత్సాహం, సందర్శకుల స్పందనఈ ఎక్స్పోను వీక్షించడానికి చిత్తూరులోని 15 పైగా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తపాలా అభిమానులు, పరిశోధకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేలాది మంది సందర్శకులు ఒకే రోజు ప్రదర్శనను వీక్షించేలా నిర్వాహకులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తమ అనుభూతులు పంచుకుంటూ %-% ప్రతి స్టాంపు వెనుక ఒక చరిత్ర దాగి ఉందని తెలుసుకున్నాం. ఇది మాకు స్ఫూర్తిదాయకంగా అనిపించింది" అన్నారు.అపోలోపెక్స్ 2025 కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాకుండా, చిత్తూరు జిల్లాలో తపాలా చరిత్రను పరిచయం చేసిన సాంస్కృతిక మైలురాయిగా నిలిచిపోనుందని ఉపాధ్యాయులు కొనియాడారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి స్కూల్ విద్యార్థులను పంపడానికి సహకరించిన కలెక్టర్, డిఈవోలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిలాటెలీ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కీర్తన, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.